విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 6, ఆగస్టు 2024

ఉపాధి పెండింగ్ బకాయిలు చెల్లించాలి..

వ్య.కా.సం ఆధ్వర్యంలో కలెక్టరుకు వినతి

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం: చాలా రోజులుగా పెండింగ్‌లో వున్న ఉపాధి హామీ కూళ్లను వెంటనే చెంల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కేశవరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పని చేసిన తొమ్మిది వారాలుగా బిల్లులు ఇవ్వడం లేదని జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ. 95 కోట్లు బకాయిలు వున్నాయని కేశవరెడ్డి తెలిపారు. వెంటనే చెల్లించి కూలీలను ఆదుకోకుంటే కూలీలను పెద్దఎత్తున సమీకరించి జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలను స్థబింపచేస్తామని హెచ్చరించారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిని అధికార పార్టీ వారు రాజకీయ వేధింపులకు గురి చేస్తూ ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారు. ఉపాధి సిబ్బందిపై రాజకీయ జోక్యం, వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది.ఉపాధి హామీలో పని చేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వంద రోజులు పని పూర్తయిన ఉపాధి కూలీలకు పని ముట్లు ఇవ్వాలని డిమాండు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రంగయ్య, జిల్లా నాయకులు. సంగప్ప. చిన్నా రాయుడు, ఎం. శ్రీనివాసులు. సూర్యనారాయణ. వి.టి. రామాంజినేయులు, రామాంజి, పెద్దయ్య పాల్గొన్నారు.

పస్తులతో అలమటిస్తున్నారు..

విశాలాంధ్ర, యాడికి : పెద్దవడుగూరు మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ అధ్యక్షతన సిపిఐ నాయకులతో కలసి ఉపాధి హామీ కూలీలకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరాముడు యాదవ్ ,సిపిఐ సీనియర్ నాయకులు నారాయణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలు పనులు చేసి గత పది వారాలకు పైగా బిల్లులు రాక, వ్యవసాయ పనులు లేక పస్తులతో అలమటిస్తున్నారు. కావున ప్రభుత్వ యంత్రాంగం ఏమాత్రం ఉపాధి హామీ కూలీలను పట్టించుకోవడం లేదన్నారు ఇప్పటికైనా పనులు చేసిన ఉపాధి హామీ కూలీలకు తక్షణమే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పని దినాలు 200 రోజులకు పెంచాలని, రోజువారి కూలీ రూ.600లకు పెంచాలని ఉపాధి కూలీలకు గడ్డపారలతో పాటు పనిముట్లను కూడా తక్షణమే అందజేయాలని, అదేవిధంగా మెడికల్ కిట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి పోలారంగస్వామి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు హుస్సేన్ పీరా, సిపిఐ నాయకులు రంగనాయకులు, వేణుగోపాల్ ,కిరణ్, నారాయణస్వామి, మల్లికార్జున, రామయ్య ఉపాధి హామీ కూలీలు, పాల్గొన్నారు.

శింగనమలలో..

విశాలాంధ్ర, శింగనమల: మండల వ్యాప్తంగా ఉపాధి పనులు చేసి రెండు మూడు నెలలు అవుతున్నా బిల్లులు మంజూరు కాకపోవడం శోచనీయమని వెంటనే ఉపాధి బిల్లులు చెల్లించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సమితి సభ్యుడు తరిమెల రామాంజనేయులు ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దారుకు వినతిపత్రం సమర్పించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ 8,9 వారాలుఉపాధి పనులు చేసి కూలీలు పస్తులతో అల్లాడుతున్నారని, వెంటనే ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు, పని దినాలు అయిపోయిన కూలీలకు 50 రోజులు ఉపాధి పని దినాలు పెంచాలని, టెంట్లు పనిముట్లు,అందించాలన్నారు, అనంతరం డిప్యూటీ తాసిల్దార్ ప్రకాష్ రావుకు వినతిపత్రం సమర్పించారు, ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఓంకార్, శ్రీరాములు, శ్రీనివాసులు, లక్ష్మి రంగయ్య,నాగరాజు, లక్ష్మీరాయణ, రవి, నరేష్, నారప్ప, ముని,తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో లుకలుకలు

ఉద్యోగుల పదోన్నతుల విషయంలో నిబంధనలు గాలికి..

చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈవో మధ్య కోల్డ్ వార్

నిజమే అంటున్నాయి ఉద్యోగ వర్గాలు!

విశాలాంధ్ర, అనంతపురం అర్బన్ : జిల్లా పరిషత్‌లో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. గతే డాది నుంచి చాపకింద నీరులా ఉన్న వ్యవహారాలు తాజాగా సీనియర్ అసిస్టెంట్ నుండి ఏ.ఓల పదోన్నతుల విషయంలో బట్టబయలయ్యాయి. ఇందులో నిబంధనలకు తూట్లు పొడిచారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జూన్ మొదటి వారంలో ప్రారంభమైన పదోన్నతి ప్రక్రియ ఆగస్టు మొదటి వారం గడిచిపోతున్న ముందుకు సాగడం లేదు. పంచాయితీ రాజ్ ఉద్యోగులు స్థానచలనం నేపథ్యంలో వివాదాస్పదంగా మారింది. ఏ.మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ మరణం తరువాత సీనియారిటీ లిస్టులో తదుపరి పదోన్నతి ఉద్యోగి భాను రేఖ పేరుపై ఫైల్ నమోదు అయ్యింది. అది తిరిగి ప్లేస్ పోస్టింగ్ కోసం పై స్థాయికి పంపితే మళ్ళీ ఇక్కడ శేషరెడ్డికి మొదట వేసిన పెనుగొండ ప్లేస్‌ను మారుస్తూ శెట్టూరుకు వేస్తూ, భాను రేఖ ఉద్యోగి పెనుగొండకు ప్లేస్ ఇచ్చారు. దీనిపై పత్రికల్లో కథనం ప్రచురితం కాగా తిరిగి ఉద్యోగులకి పదోన్నతి ఇవ్వకుండా మళ్ళీ రాత్రికి రాత్రే ఫైల్ తెప్పించుకొని పెండింగ్‌లోనే ఉంచుకున్నారని సమాచారం. ఇంతలో సీఈఓ అధికా రిణి బదిలీ పై వెళ్లిపోవడంతో పదోన్నతి పొందే ఆ ఇద్దరు ఉద్యోగుల పరిస్థితి రెండు నెలలుగా అగమ్యగోచరంగా తయారైంది.జడ్పీ చుట్టూ తిరగలేక నిరాశ నిస్పృహలకు గురి అయ్యి ఉన్నారు అని తెలిసింది.

డిప్యూటీ సీఈఓ నిబంధనలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని పాలక వర్గ పెద్దలకు నచ్చడం లేదట... అదే గొడవకు కారణమైందని ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, చట్ట ప్రకారం నడుచుకోవాలని, నిబంధన్లని పక్కాగా అమలు చేయాలని జిల్లా పరిషత్ అధికారులకు లలిత భాయి ఆదేశాలు ఇచ్చారు. ఇదే పాలక వర్గ పెద్దలకు నచ్చక, ఎదురుదాడికి దిగుతున్నారన్న ప్రచారం సాగుతోంది. అదేవిధంగా ఆరోపణలు ఉన్న ఒక ఉద్యోగి కోసం డిప్యూటేషన్‌లు సైతం రద్దు చేసేందుకు పాలక వర్గం ప్రయత్నం చేస్తోందని ఆరోపణలు లేకపోలేదు. డిప్యూటీ సీఈఓ లలితభాయి రోజు పెండింగ్ ఫైల్ పై ప్రత్యేక చొరవ అధిక సమయం కేటాయిస్తూ జెడ్పీ కార్యాలయంలో అధిక సమయం కేటాయించడం పని పూర్తి చెయ్యడం కూడా గిట్టక ప్రస్తుత సీఈఓ ప్రభాకర్ రావు ద్వార కార్యాలయంలో పని వేళలు తరువాత ఉండకూడదు అని అసాంఘిక కార్యకలాపాలు జరుగున్నాయని అనే నెపంతో ఇచ్చిన మౌఖిక ఆదేశాలు అమలు కావడం లేదు. సర్క్యులర్ ఇచ్చి పని చేయకుండా అడ్డుకుంటున్నారని ఉద్యోగ వర్గాలు గుసగుసలాడుతున్నారు. అవినీతి ఉద్యోగుల విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ చూపి జెడ్పీలో మంచి వాతావరణం తేవాల్సిన అవసరం ఉన్నతాధికారుల్లో ఉందని ఉద్యోగ వర్గాలు ఆకాంక్షిస్తున్నారు.

పంటల నమోదుపై అవగాహన పెంచుకోండి

విశాలాంధ్ర, ఉరవకొండ : రైతులు సాగుచేసిన వివిధ పంటలపై క్రాప్ బుకింగ్ తప్పక చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీమతి పద్మజ తహసిల్దార్ మహబూబ్ బాషా, తెలిపారు. సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మండల కేంద్రంలోని ఆర్ ఎస్ కె మరియు విఆర్ఓ లకు పంట నమోదు కార్యక్రమం పై వారు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఓపి ప్రకారం కచ్చితంగా పంట వేసిన ప్రతి రైతును క్రాప్ బుకింగ్ చేయాలని వీఆర్వోలు, ఆర్ఎస్కే సిబ్బంది కలిసి జాయింట్ అజమాయిషీ కింద ఏ రైతు నష్టపోకుండా పంట వేసిన ప్రతి రైతును నమోదు చేయాలని ఆదేశించారు. పంట నమోదుతో పాటు కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు రైతు కార్డులు వచ్చేలా రెండు శాఖల సిబ్బంది పనిచేయాలని దేవాదాయ శాఖ భూములు చేసుకుంటున్న రైతులను కూడా గుర్తించి సాధ్యమైనంత త్వరగా సీసీఆర్సీ కార్డులను ఇవ్వాలని అవి ఉంటేనే భవిష్యత్తులో అన్నదాత సుఖీభవకు గాని పంట నమోదుకు గాని అర్హులవుతారని పేర్కొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి వై.మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర, ఉరవకొండ: జిల్లాలో సకాలంలో వర్షాలు రాకపోవడంతో ఈ సంవత్సరం ఖరీఫ్ సాగు ఘననీయంగా తగ్గిందని జిల్లా అంతటా కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం తక్షణమే జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్చార్జ్ రాకెట్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో దాదాపు ఐదు లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావలసి ఉన్నప్పటికీ కేవలం 80 నుంచి 90 వేలు హెక్టార్లు మాత్రమే పంటలు సాగయ్యాయని, వేసిన అరకొర పంటలు కూడా సకాలంలో వర్షాలు రాక ఎండిపోతున్నాయని తెలిపారు. జిల్లా అంతటా కరువు ఛాయలు నెలకొన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. 2023 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లో ప్రకటించిన ఇన్సూరెన్స్ వెయ్యి కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలన్నారు. రైతుల పెట్టుబడి కోసం 20వేల రూపాయలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని వాటిని కూడా తక్షణమే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలు సాగుకు 100 శాతం సబ్సిడీతో విత్తనాలను రైతులకు అందించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పని దినాలు కల్పించి కూలీలకు పనులు పెట్టాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులను పూర్తి చేసి జిల్లాలో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరుతో పాటు గ్రామాలకు తాగు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. 40 సంవత్సరాల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్ర బాబు నాయుడు ఎలా చేయాలో ఆలోచించకుండా హామీలిచ్చారా అని ప్రశ్నించారు. ఇది ప్రజలను మోసం చేశాన్నారు.

హర్ గర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర, అనంతపురం అర్బన్ : హర్ గర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ సంధి రెడ్డి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం ఆర్. అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాధ్యతలు తీసుకున్నాక ఆగస్టు 15న భారతదేశమంతా కూడా ఒక పండుగ లాగా చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం హర్ గర్ తిరంగ అభియాన్ అనే పేరుతో ప్రతి ఇంటి మీద జెండా ఎగిరేయాలని దేశంలో ఉన్న ప్రతి ఒక్క భారతీయునికి దేశభక్తి పెంపొందించేలా కార్యక్రమాలు తీసుకొందన్నారు. వాటిలో ప్రతి నియోజకవర్గంలో ఆగస్టు 11, 12, 13వ తేదీల్లో తిరంగ యాత్ర పేరుతో బైక్ ర్యాలీలు నిర్వహించడం, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాలులర్పించాలన్నారు. ఆగస్టు 14న విభజన విభీషక సంస్మరణ దివాస్ పురస్కరించుకొని హాల్ సమావేశాలు నిర్వహించడం అన్ని ఇల్లు వ్యాపార సంస్థలపైన త్రివర్ణ పథకాన్ని ఎగురవేయాలని కోరారు.

అమూల్ పాల రైతులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలి..

విశాలాంధ్ర అనంతపురం : అమూల్ పాల రైతులకు న్యాయం చేయాలని పెద్దఎత్తున జిల్లా కలెక్టరేట్ వద్ద పాడి రైతులు సోమవారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు.. ఈ సందర్భంగా చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ.... జిల్లాలో వంద మహిళా సంఘాలతో ఏర్పాటు చేసుకొని అమూల్ పాల సంఘాలు సేకరిస్తున్న పాలను ఈనెల 10వ తేదీ నుంచి నిలుపుదల చేయాలని అమూల్ సంస్థ చెప్పడం జరిగిందన్నారు. పాల సేకరిస్తున్న మహిళా సంఘాల పాడి రైతులు వారికి ప్రత్యామ్నాయ చూపి న్యాయం చేయాలన్నారు. జిల్లాలో రైతులు వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. లక్ష లీటర్లు పాలు అందజేస్తున్నారని అమూల్ సంస్థ వారు ప్రభుత్వంతో ఒప్పందం చేర్చుకొని జిల్లాలో దాదాపు 100 సంఘాలు రైతులతో సొసైటీ ఏర్పాటు చేసుకున్నారన్నారు. జిల్లాలో దాదాపు 16 వేల లీటర్ల సేకరిస్తున్నారని దీనికోసం ఒక్కొక్క సంస్థకు మిషన్‌కు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారన్నారు. రాష్ట్రంలో వంద కోట్లకు పైగా ఖర్చు చేశా రన్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి అమూల్ సంస్థ వారు పాలు సేకరణ నిలుపుదల చేశారన్నారు. పాడి రైతులు నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాల డైరీల ద్వారా పాల సేకరణ చేసి వారికి న్యాయం చేయాలని జేసీని వినతిపత్రం ద్వారా కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొర్రపాడు సర్పంచ్ శ్రీనివాస రెడ్డి,పాల సేకరణ సొసైటీ ప్రతినిధులు నీళ్లపాలనాగరాజు, ఈడిగ రాజు, ఆలమూరు మాధవి, శ్రీధర్ రెడ్డి, తలపుల శివలింగ, సనప కళావతి, హరినాథ్ రెడ్డి, రైతు సంఘము జిల్లా నాయకులు పి.రామకృష్ణ, బండి రామకృష్ణ, టి.నారాయణ స్వామి, సనప రామకృష్ణ, చలపతి, ఎం.రమేష్, నరేష్, గోపాల్, నగేష్, మన్నీల వెంకట రాముడు, రాకెట్ల రాము, ధన, మహిళా సంఘం జిల్లా నాయకురాలు పార్వతి ప్రసాద్, పాడిరైతులు పాల్గొన్నారు.

దళిత గిరిజన హక్కుల సాధన సమితి నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర, ఉరవకొండ : దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి ఉరవకొండ నియోజకవర్గం నూతన కమిటీని సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్ అధ్యక్షతన సోమవారం ఉరవకొండలో హరిజన హాస్టల్ నందు సమావేశమై కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల్ విలేకరులకు విడుదల చేశారు. సాధన సమితి గౌరవాధ్యక్షుడిగా ఇంద్రవతి తలారి గంగాధర్ నియోజకవర్గం అధ్యక్షులుగా హెగడి. కుమార్, ఉపాధ్యక్షుడిగా జి.సురేష్, ప్రధాన కార్యదర్శి ఎం.కిరణ్, కార్యదర్శి గా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్.నరసింహులు, ట్రెజరర్ గా ఎస్.ప్రభాకర్, అధికార ప్రతినిధులు జి.నాగరాజు, హెచ్.ఎర్రీ స్వామి,కార్యవర్గ సభ్యులు ఎస్.నెట్టికల్లు,వై. వన్నూరుస్వామిలను ప్రకటిం చారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు.

పదవీ బాధ్యతలు స్వీకరించిన పలువురు తహసీల్దార్లు...

రాప్తాడు తహసీల్దార్‌గా విజయకుమారి

విశాలాంధ్ర,రాప్తాడు : ప్రజలకు మెరుగైన పాలన అందిస్తానని తహశీల్దార్ పి.విజయకుమారి అన్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రం రాప్తాడు తహశీ ల్దారుగా సోమవారం పి.విజయకుమారి బాధ్యతలు స్వీకరించారు. భూ సమస్యలు ఏవైనా తలెత్తితే చట్టపరంగా పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమను కలవవచ్చన్నారు. టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు, సీనియర్ నాయకులు గజ్జల నారాయణస్వామి, మరూరు గోపాల్, పుల్లలరేవు గోపాల్, గంగలకుంట కిష్ట, మాన్లుకోసే కేశవ, పసుపుల బాబయ్య, బోగినేపల్లి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ తలారి శివ, సాకే అనిల్, దండు నరేంద్ర శుభాకాంక్షలు తెలిపారు.

శింగనమలమండల తాసిల్దారుగా బ్రహ్మయ్య

విశాలాంధ్ర,శింగనమల: శింగనమల మండల తాసిల్దారుగా బ్రహ్మయ్యను నియమించినట్లు కలెక్టర్ ఉత్తర్వులు వెలుపడ్డాయి,.ఎన్నికల ముందు రాయదుర్గం నియోజకవర్గం గుమ్మ గట్ట మండల తాసిల్దార్‌గా ఆయన విధులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగిన తహసీల్దార్‌ల బదిలీలలో భాగంగా ఇక్కడ పని చేస్తున్న శోభన్ బాబు తన సొంత జిల్లా వైఎస్ఆర్ కడపకు బదిలీ కావడంతో బ్రహ్మయ్యను ప్రభుత్వం నియమించింది. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు,

బొమ్మనహాల్ తహశీల్దార్‌గా మునివేలు

విశాలాంధ్ర బొమ్మనహాల్... బొమ్మనహాల్ మండల తహసిల్దార్‌గా మునివేలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసిల్దార్‌గా పనిచేస్తున్న రామాంజినమ్మ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. మునివేలు మాట్లాడుతూ ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకోకుండా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా నా దృష్టికి తీసుకురావాలని వీఆర్వోలకు సూచించారు. టీడీపీ నాయకులు కొత్తపల్లి రవి, కేశప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు, అనంద్ తదితరులు తహసిల్దార్ మునివేలుకు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎంఈఓ మల్లికార్జున, ఎంఆర్సి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గుత్తి తహశీల్దార్‌గా ఓబిలేసు

విశాలాంధ్ర, గుత్తి : మున్సిపాలిటీ తహశీల్దార్ కార్యాలయంలో నూతన తహసిల్దార్‌గా హెచ్.ఓబులేసు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ముందుగా రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు ఎంకే చౌదరి,జక్కలచెరువు నారాయణస్వామి, ప్రతాప్, బాషా,బేతాపల్లి ధనుంజయ శుభాకాంక్షలు తెలిపారు.

ఉరవకొండ తహసీల్దార్‌గా మహబూబ్ భాష

విశాలాంధ్ర,ఉరవకొండ : ఉరవకొండ మండల నూతన తహశీల్దార్‌గా ఎస్. మహబూబ్ భాష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ మేరకు ఇతర జిల్లా నుంచి వచ్చిన తహసిల్దార్ శ్రీనివాసులు తన సొంత స్థానానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో మహబూబ్ బాషాబదిలీపై ఉరవకొండకు వచ్చారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ మహా ధర్నా జయప్రదం చేయండి

ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనేది డిమాండ్

విశాలాంధ్ర, గుత్తి (గుంతకల్) : ఏఐఎస్ఎఫ్ గుంతకల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బి.టి పకీరప్ప భవనం లో సోమవారం పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియాజకవర్గ అధ్యక్ష కార్యదర్శిలు వి.వినోద్ ఆర్.వెంకట్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ హాస్టల్లో సమస్యల పరిష్కారం కోసం గుంతకల్ నియోజకవర్గం వ్యాప్తంగా జూలై 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హాస్టల్లో సందర్శన కార్యక్రమం చేసి అనంతరం ఆగస్టు ఒకటో తేదీ నుంచి రెండో తేదీ వరకు నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజుల పాటు జీపు జాత కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న కాస్మటిక్ చార్జీలు మిస్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని తెలిపారు. జిల్లాలో కొన్ని శతాబ్దాల కాలం నుంచి ఉంటున్న ప్రభుత్వ హాస్టల్లో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి తక్షణమే వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలన్నారు. హాస్టల్లో మరమ్మత్తుల కోసం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని పేర్కొన్నారు. హాస్టల్ విద్యార్థులకు అద్దె భవనాల్లో కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సొంతభవనాలు నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ హాస్టల్స్ ఖాళీగా ఉన్న వార్డెన్ కుక్ అటెండర్ కామాటి పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు అదేవిధంగా ఉన్నత చదువులకు దూరం చేసే విధంగా ఉన్న జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలు పాఠశాల జూనియర్ డిగ్రీ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన బోధ నేతర పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్స్ జూనియర్ కళాశాల కేజీబీవీ మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యలు గుర్తించామని ఆ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఆరవ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహా ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఈ ధర్నా కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి లక్ష్మీ ప్రసాద్ ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శి శివమణి అఖిల్ ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు రోహిత్,శేక్షావలి రాజేష్, బాలరాజు, అశోక్, పవన్, గుత్తి మండల నాయకులు సునీల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు

కృష్ణా గోదావరి నదీ జలాల పున: పంపిణీ చేపట్టాలి

- రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర,అనంతపురం : కృష్ణా, గోదావరి నదీ జలాల పున:పంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘస్ర రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి రైతు సంఘము జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014, గత ట్రిబ్యునల్ వారి తుది ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఏ విధమైన అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం- పేస్ 2 తదితర ప్రాజెక్టుల నిర్మాణం ముప్పు దిగువ రాష్ట్రమైన మన ఆంధ్రప్రదేశ్ కు జరిగే నష్టాలను ట్రిబ్యునల్ దృష్టికి తేవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు దిగువన నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుండి తెలంగాణా 99 టీఎంసీల నీటిని, ఏపీకి 33 టి.యం.సిల నీటిని వినియోగించుకోవాల్సి ఉందన్నారు. మన రాష్ట్రానికి రావాల్సిన 33 టి.యం.సిల నీరు రాకపోవటం వల్ల 3,4 జోన్లకు ఏ సంవత్సరంలో కూడా నీరు అందని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీని వల్ల రైతాంగం నష్టపోతున్నారనే విషయాన్ని నివేదించాలని కోరారు, ఎగువ రాష్ట్రాలైన మహా రాష్ట్ర, కర్ణాటక, మరియు తెలంగాణ రాష్ట్రాలు వర్షపు నీటిని నిలువ చేసుకోవడం వలన మన రాష్ట్రానికి సకాలంలో నీరు లభిం చని పరిస్థితి ఏర్పదిందని, తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతు న్నాయన్న అంశాన్ని కూడా ట్రిబ్యునల్‌కు నివేదించా లన్నారు. గోదావరి నది నీటి పంపిణీ విషయం చర్చించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం పులిచింతల ప్రాజెక్టులో 30.23 టీఎంసీల నీరు నిల్వ ఉంచాలన్నారు. ఏటా కృష్ణా డెల్టాకు జూన్ మొదటి వారంలో నారుమళ్లు పెంచుకోవడానికి నీటిని విడుదల చేయాలన్నారు. డెల్టా ప్రాంతంలోని సుమారు 70 లక్షల మంది ప్రజలకు మార్చి నుండి జూన్ వరకు నాగర్జున సాగర్ నుంచినీటిని విడుదల చేయాలన్నారు. ప్రతి సంవత్సరం మార్చి నుండి జూన్ నెల వరకు విద్యుత్ ఉత్పత్తి నిలుపుదల చేయాలని కోరారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని పై అంశాలను చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు,సాగునీటి రంగనిపుణలతో సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి రామకృష్ణా రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి కి పంపించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు నివేదించాలని కోరారు.కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ,టి.నారాయణస్వామి, కార్యదర్శులు సనప రామకృష్ణ, చలపతి, రమేష్, నరేష్, నగేష్, గోపాల్, మన్నీల వెంకట రాముడు,ఏఐవైఎఫ్ నాయకులు రాకెట్ల రాము,ధనుంజయ, పార్వతీ ప్రసాద్, కౌలు రైతు సంఘం నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

ఏఐటీయూసీ నాయకులు

ఆర్ఎంఓకు వినతిపత్రం ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర, అనంతపురం : అనంతపురము ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్ కార్మికులకు జి.ఓ నెం 549 ప్రకారం 16 వేల వేతనం ఇవ్వాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ లు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి పాత ఓపీ ముందు ధర్నా నిర్వహించి ఆర్ఎంఓ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా ప్రకాష్,రాజేష్ గౌడ్‌లు మాట్లాడుతూ.... ఏ 1 సర్వీసెస్ కాంట్రాక్టరు మూడు సంవత్సరాల నుండి ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదన్నారు. జి.ఓ నెం 549 ప్రకారం వేతనాలు 16 వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తే కాంట్రాక్టరు గడిచిన మూడేళ్లలో రూ.11,200 మాత్రమే ఇచ్చారన్నారు. 16 వేల వేతనానికి సరిపడ పీఫ్ కూడా కట్టకుండా కట్టడం లేదన్నారు. 20 శాతం కూడా కట్టకుండా కార్మికులను దోపిడీకి గురిచేస్తున్నా రన్నారు. కార్మికులకు 4 నెలల నుండి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల కుటుంబ పోషణ, ఇంటి బాడుగలు కట్టలేక రోడ్డున పడే పరిస్థితి తెచ్చిన కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం తగదన్నారు. కాంట్రాక్టరు కాల పరిమితి అయిపోతున్న పట్టించుకోవడం లేదని ఉద్యమానికి సిద్ధమయ్యామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు జి చిరంజీవి,వికే కృష్ణుడు, మెడికల్ యూనియన్ జిల్లా కార్యదర్శి మనోహర్, మెడికల్ ఇంజనీర్ నాయకులు వెంకటేష్,కాంతమ్మ, రామాంజనేయులు, భార్గవి, కళ,గంగన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు..

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 6, ఆగస్టు 2024

అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి

- మడకశిరను అగ్రస్థానంలో నిలుపుదాం...
- మండల సర్వసభ సమావేశంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

విశాలాంధ్ర-అగళి : మండలంలో అన్ని శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రేణుక కామరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పాల్గొని మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని పనులు చేయాలని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మడకశిర నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపడానికి ప్రతిఒక్కరూ సమిష్టిగా పని చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన సమస్యలను మరో మూడు నెలల్లో జరిగే సమావేశం లోపు పరిష్కరించాలని సూచించారు. మళ్లీ ఆవే సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఏదో మొక్కుబడి గా సమావేశాలకు వచ్చి చేతులు దులుపుకొంటే సరిపోదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రతి ఉద్యోగి ఆయా శాఖకు సంబంధించి పూర్తిగా అవగాహనా కలిగి ఉండాలన్నారు. వారానికోసారి ప్రజలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇంకా మండల వ్యాప్తంగా 1200 మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడీ రావాల్సి ఉందని ఎ ఓ శేఖర్ నాయక్ తెలుపుగా రెండు రోజుల్లో తప్పులను సరి చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. భూయాజమాన్యులు నుంచి భూములను కౌలుకు తీసుకొని సాగు చేసిన పంటలు దెబ్బతిన్న ఇతరత్రా కారణాలతో నష్టపోతే కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి అందే నష్టపరిహారం పంటలబీమా అందే విదంగా చూడాలన్నారు. మండల వ్యాప్తంగా 13 పంచాయతీలుంటే కేవలం నలుగురు పంచాయతీ కార్యదర్శులు వున్నారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలుపుగా కొరత తీర్చుతామని ఎమ్మెల్యే తెలిపారు.

తహసీల్దార్, డీఎస్పీ పదవీ బాధ్యత స్వీకరణ

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ తాహసీల్దార్‌గా కె శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్నికల విధులకు చిత్తూరు జిల్లాలోని రామకుప్పం మండల తాహసీల్దార్ పనిచేసి ఇటీవలే సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. కలెక్టర్ చేతన్ ఆయనను పెనుకొండకు బదిలీ చేశారు. తాహసీల్దార్ సోమవారం బాధ్యతలకు స్వీకరించారు. కార్యా లయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తాహసిల్దార్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తానని తెలిపారు.

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ పోలీస్ సబ్ డివిజనల్ అధికారిగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఆయన నెల్లూరు జిల్లాలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పి మాట్లాడుతూ సమిష్టి కృషితో స్నేహపూర్వక పోలీస్ విధానాన్ని పాటిస్తూ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పోలీసులను తమ విధులలో చేయవలసిన పనులలో ప్రోత్సహిస్తామన్నారు.

రైతాంగాన్ని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి

- ప్రత్యామ్నాయ పంటలకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి
- ఆర్డీవోకు సిపిఐ, ఏఐటీయుసి నాయకులు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-కదిరి: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునే విదంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ పట్టణ కార్యదర్శి లియాకత్, ఏఐటీయూసీ నాయకులు మధు నాయక్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణ కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఇప్పటివరకు కనీసం 20 శాతం భూముల్లో విత్తనం పడలేదని, దీంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. గతేడాది ఇలాంటి భయంకం కరువు వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని,గత ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ కరువు సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దీంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఈఏడాది అదే పరిస్థితి పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలు 100 శాతం సబ్సిడీతో అందించాలని, ఎన్నికల వాగ్దానాల మేరకు ప్రతి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం, తెలంగాణ ప్రభుత్వ తరహాలో ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయలు రుణాలు రద్దు చేయాలని, బిందు తుంపర సేద్య పరికరాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని,. హంద్రీనీవా ద్వారా ఆయ కట్టుకు నీరు ఇవ్వడానికి పంట కాలవలు పూర్తి చేసి నిర్దేశించిన ఆయకట్టుకు నీరు ఇవ్వాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లేపాక్షి తహసీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర- లేపాక్షి : ఈ ఏడాది సానుకూలంగా వర్షాలు పడకవి చాలామంది రైతన్న లు పంటలు పెట్టక తెచ్చిన విత్తనాలను ఇంటిలోనే ఉంచుకొని ఆర్థికంగా నష్ట పోయారని వెంటనే ప్రభుత్వం రైతన్నలను ఆదుకొని ప్రయత్నం చూపాలని లేపాక్షి సిపిఐ మండల కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం స్థానిక తహసిల్దార్ కార్యాల యంలో రెవెన్యూ అధికారులకు రైతన్నల సమస్యలపై వినతి అందజేశారు. సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి గౌతమ్ కుమార్, నరసింహారెడ్డి, మారయ్య, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

విత్తనాలను నూరు శాతం రాయితీతో అందించండి

విశాలాంధ్ర-తనకల్లు: ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలైన సజ్జలు రాగులు, కొర్రలు, సామలు, కందులు, పెసలు, ఆముదం గింజలు, అలసందలు, జొన్నలు తదితర విత్తనాలను ప్రభుత్వం నూరు శాతం రాయితీతో అందించాలని సిపిఐ నాయకులు, రైతు సంఘం నాయకులు సోమవారం తాహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం తాహసిల్దార్ సోఫా సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ రెడ్డప్ప, రైతు సంఘం నాయకులు చౌడప్ప యాదవ్, కరీముల్లా, సిపిఐ నాయకులు ఆనంద్, రవి, రవీంద్ర నాయక్ తోపాటు

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-రొద్దం: స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా సిపిఐ కమిటీ ఆ సభ్యులు బాలస్వామి ఆధ్వర్యంలో రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ డిప్యూటీ తాహసిల్దార్ ఖలీల్ కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల్లో గత ప్రభుత్వం కరువు మండలం గుర్తించిన రైతులను ఆదుకోలేదన్నారు. ఈ సంవత్సరం వర్షావ పరిస్థితుల్లో దాదాపు 80 శాతం భూముల్లో ఎలాంటి పంటలు రైతులు సాగు చేయలేదని, ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో ప్రతాన్మయ విత్తనాలు వంద శాతం సబ్సిడీతో రైతులకు అందజేయాలని కోరారు. డిప్యూటీ తాహసిల్దార్ ఖలీల్ కలెక్టరుకు నివదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాలు, మైలారప్ప, చాంద్ భాషా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-ముదిగుబ్బ : సిపిఐ పార్టీ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ రైతు సంఘం మండల నాయకులు స్థానిక రైతుల సమస్యలపై సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో ఇంచార్జ్ తాహసిల్దార్ డిఎస్‌డిటి మునుస్వామికి వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు శ్రీనివాసలు మాట్లాడుతూ ఈసారి తీవ్ర వర్షాభావ పరిస్థితి ఏర్పడి మండలంలో 20% కూడా వేరుశనగ పంట సాగు చేయబడలేదు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులకు 100 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయాలన్నారు, ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చుక్కల భూముల సమస్యను కూడా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, రైతు సంఘం నాయకులు తుమ్మల చిన్నప్ప , రాధాకృష్ణ, సింగరయ్య, ఏ రామంజి, ఏ ఐ ఎస్ ఎఫ్ మండల నాయకులు దేవేంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఓబులదేవుల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మడకశిర నాయకులు

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సోమదేవులపల్లి నేతలు

కరువు మండలంగా గుర్తించాలి

తహసీల్దార్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతి

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అక్బుల్ బాషాకు సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ జిల్లా పరిధిలో సమయానికి వర్షాలు రాక రైతులు పంట పెట్టే దానికి పెట్టుబడి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెట్టుబడి సాయం కింద రూ.20 వేల ఆర్థిక సాయం ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. జిల్లాలో తీవ్ర వర్ష ప్రభావం నెలకొని ఉన్నందున ఇప్పటివరకు కనీసం 20 శాతం భూముల్లో కూడా విత్తనాలు వేయలేదనీ, రైతాంగం దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజా సమస్యలు తెలుసుకొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కదిరి : తాలూకా పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కారం చేయడం కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రజా దర్బార్ క్యాంపు నిర్వహించారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పలు రకాల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగ కొన్నింటిని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు.

సీనంపల్లిలో చోరీ ..

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండలంలోని సీనంపల్లి గ్రామంలో వడ్డే వెంకటరామప్ప ఇంట్లో చోరీ జరిగింది. వడ్డే వెంకటరామప్ప తన భార్యతో కలసి తన కుమారులు బెంగళూరులో ఉండడంతో గత 2వ తేదీన ఉదయం ఇంటికి తాళాలు వేసివెళ్ళాడు. 3వ తేదీ చుట్టుప్రక్కల వారు ఇంటికి తలుపులు తెరిచి ఉన్నాయని ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చాడు. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేసి రూ.లక్ష నగదు, 2 తులాల బంగారు చోరీ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

పాడి రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి : అమూల్ కంపెనీ పాడి రైతుల ద్వారా సేకరిస్తున్న ప్రస్తుత విధానాన్ని అమలుపరచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు అడపాల వేమ నారాయణ మహాదేవ్ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు మహిళా సహకార సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అడపాల వేమ నారాయణ, మహాదేవ్ మాట్లాడుతూ అమూల్ కంపెనీ పాల సేకరణను నిలిపివేస్తామంటూ వార్తలు రావడం తో సంఘాలు పాడి రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేటు పాల డైరీలు రైతులను దోపిడీ చేస్తున్నాయన్నారు. మహిళా సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మహాధర్నా

జయప్రదం చేయండి

విశాలాంధ్ర-హిందూపురం : ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు, మిస్ చార్జీలు విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కొనసాగిం చాలని, హాస్టల్ విద్యార్థుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన ద్వారా హసోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ హాస్టల్లో సమస్యల పరిష్కారం కోసం శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా జూలై 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హాస్టల్లో సందర్శన, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న కాస్మటిక్ చార్జీలు మిస్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని, జిల్లాలో కొన్ని శతాబ్దాల కాలం నుంచి ఉంటున్న ప్రభుత్వ హాస్టల్లో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, తక్షణమే వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలన్నారు. హాస్టల్లో మరమ్మత్తుల కోసం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు అద్దె భవనాల్లో కాకోకుండా రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టల్స్ ఖాళీగా ఉన్న వార్డెన్ కుక్ అటెండర్ కామాటి పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించి, విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఉన్నత చదువులకు దూరం చేసే విధంగా ఉన్న జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలు పాఠశాల జూనియర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన బోధ నేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్స్ జూనియర్ కళాశాల కేజీబీవీ మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నేడు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపడుతున్నామని విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, నియోజవర్గ అధ్యక్షులు దేవరాజు, నాయకులు మహేష్, నాగేంద్ర, వరుణ్, భార్గవ్, ఆదర్శ, రాజేష్, వినయ్,రాకేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులతో గ్రామీణులకు ఎంతో లబ్ధి

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఛాయాదేవి

విశాలాంధ్ర-ధర్మవరం: ఉపాధి హామీ పనులతోనే గ్రామీణులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకమ్ మధుసూదన్ రెడ్డి సతీమణి చిలకమ్ ఛాయాదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని రేగాటిపల్లి పంచాయతీ లోని ఉపాధి హామీ పనులను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి సతీమణి శ్రీమతి చిలకం ఛాయదేవి ప్రారంభించారు. అనంతరం ఛాయాదేవి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు, కుటుంబానికి ఎంతో ఉపయోగపడతాయని, కుటుంబ జీవన విధానం సులభతరం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు వెళ్లాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు చిలకమ్ మధుసూదన్ రెడ్డి అభిమానులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ...

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని లక్ష్మీ నగర్‌లో ఉంటున్న ఉపాధ్యాయుడు బాలాజీ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. ఈ సందర్భంగా టూటౌన్ సిఐ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అనంతరం సీఐ మాట్లాడుతూ లక్ష్మీ నగర్ లోని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడ సిబ్బందితో వెళ్లడం జరిగిందని తెలిపారు. కుటుంబ పనిమీద బాలాజీ తో సహా కుటుంబ సభ్యులు ఉఫ్లీకి వెళ్లడం జరిగిందని, ఆదివారం రాత్రి దొంగలు ఇంటి తాళాలను పగలగొట్టి, బీరువాను పగల కొట్టి వస్తువులను చిందర వందర చేయడం జరిగిందని తెలిపారు. ధర్మవరంలోని బంధువులు టీచర్ బాలాజీకి ఫోన్ చేసిన ప్రకారం బీరువాలో 22 వేల రూపాయలు ఉండేదని తెలిపారు. ప్రస్తుతం దొంగలు ఆ డబ్బును దోచుకు వెళ్లారని తెలిపారు. సమాచారాన్ని టీచర్ బాలాజీకి తెలపడం జరిగిందని, ఇంటిలో ఇంకా ఏమైనా విలువ గల వస్తువులు ఉన్నాయా తదితరు వాటిని గురించి అడిగి తెలుసుకుంటామని, మంగళవారం ధర్మవరానికి రానున్నారని తెలిపారు. టీచర్ బాలాజీ వచ్చిన తర్వాత వారి ద్వారా కంప్లైంట్ తీసుకొని దొంగతనానికి గురైన వాటిని నమోదు చేసి, కేసు నమోదు చేసి విచారణ చేపడతామని తెలిపారు. త్వరలోనే దొంగలను చేది స్తామని తెలిపారు.

ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలి ..

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ డివిజన్ పరిధిలోని పెనుకొండ మండలంలోని గత ఏడాది నుంచి మంచి వర్షాలు లేక ఆరో కోరో వర్షాలకు వేసిన విత్తనాలు కూడా మోలవ కుండా పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కావున రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం పెనుకొండ తాహసిల్దార్ శ్రీధర్ కు సిపిఐ నాయకులు బాలా స్వామి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సిపిఐ నాయకులు ప్రభుత్వానికి కొన్ని డిమాండ్లను నిర్దేశిస్తూ రైతులకు డిమాండ్ల నెరవేర్చాలని వారు కోరారు. డిమాండ్లలో రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలను 100 శాతం సబ్సిడీతో అందించాలని, అధికార పార్టీ నాయకులు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం 20 వేల రూపాయల వెంటనే ఇవ్వాలని, తెలంగాణ ప్రభుత్వ సలహాలు ప్రతి రైతుకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని, డ్రిప్పు పరికరాలను తుంపర సేద్య పరికరాలను 90% సబ్సిడీతో ఇవ్వాలని, హంద్రీ నీవా ద్వారా చెరువులకు నీరు నింపి కాలువలను బాగు చేసి చివరి ఆయకట్టు వరకు మీరు అందించాలని కోరారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు ప్రతినెల పెన్షన్ను 10వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు నుంచి బ్యాంకు రుణాలు అందే విధంగా చూడాలని కోరారు. కృష్ణాజిల్లాలను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాల నివేదికల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి నష్టం వాటిల్లకుండా నివేదికలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాంద్ బాషా ,ఆంజనేయులు, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం వంటిది..

తల్లిపాల వారోత్సవంలో సీడీపీఓ లక్ష్మి...

విశాలాంధ్ర-ధర్మవరం: తల్లిపాలే బిడ్డకు అమృతం వంటిదని సిడిపి ఓ లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని యాదవ్ వీధి సెక్టార్‌లోని బోయ వీధిలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీ నుండి ఏడవ తేదీ వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ పెరుగుదలకు, తెలివితేటలకు ఆధారమవుతుందని తెలిపారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మణిమాల, ఏఎన్ఎం వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, శివకుమారి, అంగన్వాడి టీచర్లు పార్వతి, కవితా, చంద్రకళ, హెల్పర్లు ముబీనా, భాగ్యమ్మ, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

స్నేహ భావంతో కలసి మెలసి ఉండాలి

విశాలాంధ్ర-ధర్మవరం: అందరూ స్నేహ భావం తో కలిసి, మెలసి ఉండాలని ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ధర్మవరం బార్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులు సింగం కృష్ణ మూర్తి మాట్లాడుతూ స్నేహం అనేది విడదీయరాని సంబంధమని, కష్టాలలోనూ సుఖాలలోను ఒక్క స్నేహితుడే అన్ని రకాలుగా ఆదుకునే గుణం ఉంటుందని తెలిపారు. ఒకరినొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. న్యాయవాదులు జె.గోపికృష్ణ, డి.భార్గవి, సి.గుంటెప్ప,ఎమ్. నరసింహ మూర్తి, జె. శివ కుమార్, టి.బాబాఫక్రుద్దీన్, ఎమ్. పెద్దన్న పాల్గొన్నారు.

15 నుండి అన్నా క్యాంటీన్లు ఏర్పాటు

విశాలాంధ్ర-ధర్మవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ధర్మవరం పాత ప్రభుత్వ ఆసుపత్రి పక్కన, ఎల్సీ సర్కిల్లో మరొక అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామని టీడీపీ నాయకులు తెలిపారు. ఉదయం అల్పాహారం (టిఫిన్), మధ్యాహ్నము, రాత్రి భోజనం కేవలం రూ.5లకే పేద ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. అక్షయపాత్ర ఏజెన్సీ ద్వారా ఈ అన్న క్యాంటీన్ ఏర్పాట్లను చేశామన్నారు. టోకెన్ పద్ధతి ద్వారా పంపిణీ చేయబడుతుందని తెలిపారు. అదేవిధంగా ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా ప్రభుత్వం చేపట్టడం జరిగిందని తెలిపారు.

డిప్యూటీ సీఎం అడుగుజాడల్లోనే ..

విశాలాంధ్ర-ధర్మవరం: జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లోనే ముందుకెళ్తామని జనసేన పార్టీ సీనియర్ నాయకులు చిలకం వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారంఆయన మాట్లాడుతూ జన సైనికులు, పట్టణ, నియో జకవర్గ, రాష్ట్ర ప్రజలు పుర ప్రముఖులు ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ సభ్యత్వం స్వీకరించాలని పార్టీలోనే కార్యకర్తలకు నాయకులకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ధర్మవరం మండలం రేగాటి పల్లి పంచాయతీకి చెందిన చిలకం వెంకటరెడ్డి విజయవంతంగా 1000 సభ్యత్వాలు పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు.

లేబర్ ఆఫీసును ఏర్పాటు చేయండి..

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో లేబర్ ఆఫీసును ఏర్పాటు చేయాలని సిఐటియు నాయకులు జిల్లా కలెక్టరుకు గ్రీవెన్స్ డే సందర్భంగా డిఆర్ఓ కొండయ్యకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ధర్మవరంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసు ఉండేదని, పుట్టపర్తి జిల్లా ఏర్పడిన తర్వాత ధర్మవరం నుండి కొత్తచెరువుకు మార్చడం జరిగిందని, దీనివల్ల దాదాపు వేల సంఖ్యలో ఉన్న కార్మికులు కొత్తచెరువుకు వెళ్లలేక పోతున్నారని తెలిపారు. భవన నిర్మాణ, ఆటో, వెల్డింగ్, బట్టల షాపు, సిల్క్ హౌస్ కార్మికులు తదితర అసంఘటిత కార్మికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మండల కమిటీ కన్వీనర్ జెవి. రమణ, కో కన్వీనర్ ఆయుబ్ ఖాన్, గంగాధర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత..

విశాలాంధ్ర-ధర్మవరం: డోలా రాజా రెడ్డి తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. పట్టణంలోని 27వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన బద్రి ప్రసాద్ (65) అనారోగ్యంతో మృతి చెందగా డోలా రాజారెడ్డి మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకొని వెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు వారి ఇంటికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. తన వంతుగా ఆ కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించారు. 41 వార్డులో మెకానిక్ బాబు దయాలసిస్ వల్ల ఇంట్లో ఒక పూట గడవడం కష్టంగా ఉంది. బీజేపీ నాయకుడు మిరి యాల అంజి మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు రూ.10 వేలు అం దించారు. బిజెపి కార్యాలయ ఇంచార్జ్ హరీష్, సిబ్బంది మల్లికార్జున, సునీల్, డోలా రాజా రెడ్డి, నాయకుడు రామాంజనేయులు, హనుమంతు, శరత్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తా..

విశాలాంధ్ర-లేపాక్షి : మండలంలో నిరంతరం ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్తూ తమదైన పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి అండగా వుంటానని లేపాక్షి ఆలయం కమిటీ చైర్మన్ కరణం రమానందన్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం వీరభద్రస్వామి దేవాలయం ఆవరణంలో మండలంలోని జర్నలిస్టులకు తపాలా ప్రమాద భీమా కార్డులను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రమాద బీమాను తన సొంత ఖర్చులతో అందజేసి పాత్రికేయులకు అకౌంట్ కార్డులను అందజేసారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతే వార్తా సేకరణలో ఎన్నోరకాల ఒత్తిడులకు గురి అవుతుంటారని, ఏదైనా ప్రమాదం జరిగితే జర్నలిస్ట్ కుటుంబం ఇబ్బందులు పడకుండా వారిని కొంత మేరకు ఆదుకునే ఉద్దేశ్యంతో తనవంతుగా తపాలా ప్రమాద బీమా కార్డులు అందజేసినట్టు తెలిపారు. మీరు జర్నలిస్టులుగా ఉన్నంత వరకు తాను తపాలా బీమా ప్రీమియం చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా చరిత్ర కలిగిన లేపాక్షి దేవాలయం అభివృద్ధికి జర్నలిస్టులు ముందుండాలని ఆకాంక్షించారు ముందుగా హిందూపురం ప్రెస్ క్లబ్ శాశ్వత అధ్యక్షులు పాటు మండల జర్నలిస్టులు చైర్మన్‌ను సన్మానించారు

బెస్ట్ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-గోరంట్ల: మండలం లోని కమ్మల వాండ్లపల్లి వద్దగల (బెస్ట్) భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ విద్యార్థుల వ్యవస్థాపక ఆకాంక్షలకు మద్దతుగా మరియు పెంపొందించడానికి ఉద్దేశించిన దాని ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిగా గుర్తించబడిందన్నారు, క్యాంపస్ పెవిలియన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్టమైన అతిథులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతలో ఈ కొత్త శకాన్ని చూసేందుకు ఆసక్తిగా పాల్గొన్నారు,వేడుకకు హాజరైన వారిలో శ్రీ జై ప్రకాష్ టిజి (రిజిస్ట్రార్), డాక్టర్ శర్మ (స్టూడెంట్ అఫైర్స్ డీన్), డాక్టర్ లక్ష్మీ నరసప్ప (సీట్ డీన్), మరియు డాక్టర్ రామ్ గోపాల్ (డీన్ ఆఫ్ రీసెర్చ్) ప్రసంగించారు. ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ స్టాలిన్, సృజనాత్మకత మరియు ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వైస్-ఛాన్సలర్ డా. సుబ్రహ్మణ్య స్ఫూర్తిదాయకమైన ప్రారంభోపన్యాసం చేస్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులను వారి వ్యవస్థాపక కలలను సాకారం చేసే దిశగా ఈ కేంద్రం ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు దారితీస్తుందని పేర్కొన్నారు, సృజనాత్మకత మరియు ఆవిష్కరణలు వృద్ధి చెందగల వాతావరణాన్ని పెంపొందించడానికి వర్క్‌షాప్‌లు, మెంటర్‌షిప్ మరియు నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించడం ఇంక్యుబేషన్ సెంటర్ లక్ష్యం. డాక్టర్ సుబ్రమణ్య నేతృత్వంలో సంప్రదాయకమైన దీపాలు వెలిగించే కార్యక్రమం జరిగింది మరియు ముఖ్య విశ్వవిద్యాలయ సభ్యులు పాల్గొన్నారు, హాజరైన వారికి కృతజ్ఞతలు తెలిపిన మరియు భవిష్యత్ విద్యార్థుల ఆవిష్కరణల సామర్థ్యాన్ని హైలైట్ చేసిన శ్రీమతి రచన యొక్క ముగింపు వ్యాఖ్యలతో ఈవెంట్ ముగిసింది.

పార్టీకి కష్టపడ్డా వారికి మంచి గుర్తింపునిస్తాం..ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

విశాలాంధ్ర-అగళి : తెలుగుదేశం పార్టీకి కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు ఆగలి మండలంలో సోమవారం పర్యటన సందర్భంగా వారు మాట్లాడారు తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి అంబేద్కర్ వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఎమ్మెల్యే రాజును రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ని గజమాలతో నాయకులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వైసిపి ప్రభుత్వం లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రతి ఒక్కరికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అగలి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుంది. అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు .రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు గుండుమల పేర్కొన్నారు. మండలంలోని నందరాజనపల్లి ఇరిగేపల్లి గ్రామాల్లో కరుడుగట్టిన తెలుగుదేశం నాయకులు మాజీ మండల కన్వీనర్ ముకుందప్ప చిక్కన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చారు పార్టీ అండగా ఉంటుందన్నారు అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులకు సూచించారు. ఇరిగేపల్లి సర్పంచ్ లక్ష్మమ్మ లింగరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా టి ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, జడ్పిటిసి ఉమేష్, సత్యసాయి జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, మండల పార్టీ కన్వీనర్ కుమార్ స్వామి, దాసి రెడ్డి , మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, సర్పంచు నరసింహమూర్తి, మాజీ సర్పంచులు రవికుమార్, శివకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో ఉపాధ్యాయుల కొరత తీర్చండి

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని మద్దనకుంట,మోరబాగల్, కె.కె. పాళ్యం. గుడిబండ మందలపల్లి పీసీ గిరి, జంబలబండ, తదితర గ్రామాలలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత విద్యార్థులకు తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా రెండు ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండగా ఇంగ్లీష్, మ్యాక్స్, ఫిజికల్ సైన్స్ తదితర సబ్జెక్టుకు సంబంధించి ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్న ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యా శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వం స్పందించి మండలంలోని పాఠశాలలకు పూర్తిస్థాయి ఉపాధ్యాయులు నియమించి విద్యా ప్రమాణాలను పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతులు ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేయాలి-సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-రొద్దం: స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా సీపీఐ కమిటీ ఆ సభ్యులు బాలస్వామి ఆధ్వర్యంలో రైతులు ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేయాలని డిప్యూటీ తహసిల్దార్ ఖలీల్ కు డిమాండ్ల తో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ సత్య సాయి జిల్లాలో వర్షాభావ పరిస్థితుల్లో గత ప్రభుత్వం కరువు మండలం గుర్తించిన రైతులను ఆదుకోలేదన్నారు. ఈ సంవత్సరము వర్షావ పరిస్థితుల్లో దాదాపు 80% శాతం భూముల్లో ఎలాంటి పంటలు రైతులు సాగు చేయలేదని, ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు నూరు శాతం సబ్సిడీతో రైతులకు అందజేయాలి, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల భాగంగా రైతులకు రూ. 20 వేలు, పంటలు పెట్టుకోవడానికి అందజేస్తా మని చెప్పిన ఇంతవరకు ఒక్క రూపాయి రైతులకు సహాయం చేయలేదని, తెలంగాణ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసిందని, ఆంధ్రప్రదేశ్లో రుణమాఫీ చేసి రైతులు ఆదుకోవాలని, 60 సంవత్సరాలు పైబడిన రైతులకు నెలకు పదివేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలని తదితర డిమాండ్లను అధికారులకు వివరించారు. డిప్యూటీ తాహసిల్దార్ ఖలీల్ ఈ విషయం జిల్లా కలెక్టర్కు నివదిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముత్యాలు, మైలారప్ప, చాంద్ భాషా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుపల్లి సత్యసాయి పంప్ హౌస్ ను పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ధర్మవరం శాసన సభ్యులు ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు కొండగట్టుపల్లి పంచాయతీలో ఎంపీపీ గొద్దుమర్రి ఆదినారాయణ యాదవ్ పర్యటన చేసి ముఖ్యంగా కొండగట్టుపల్లిలో గత 5 సంవత్సరాలుగా నీటి కొరత తీవ్రంగా ఉండడంతో గ్రామం మొత్తానికి ఒక్కటే నీటి కుళాయి .గ్రామములో పాఠశాలలో గల బోరును తయారు చేసి,అందులో చేతి పంపును అమర్చాలి అని తెలుసుకొని తక్షణమే నాలుగు రోజులు లోగా నీటి సమస్యను పరిష్కరిస్తాము అని ఎంపీపీ తెలిపారు. అలాగే కొండగట్టుపల్లి సత్య సాయి నీటి పంప్ హౌస్ తనిఖీ చేశారు. అదేవిధంగా కొండగట్టుపల్లి గ్రామములో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తనిఖీ చేసి. అక్కడ పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో చెప్పండి అని వివరంగా అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో డి ఈ షాంతాన్న, ఈ ఓ ఆర్ డి ,ఏ ఈ ప్రసాద్, బిజెపి మండల అధ్యక్షులు సోమల ప్రకాష్ నాయుడు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బిల్లు కుళ్ళాయప్ప యాదవ్,కూటమి నాయకులు గడ్డం మోహన్ కృష్ణమూర్తి యాదవ్ ,బిజెపి నాయకులు కూడేరు రాము.గంగాధర్ రెడ్డి.నాగేంద్ర. కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతన్నలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

విశాలాంధ్ర-లేపాక్షి : ఈ ఏడాది సానుకూలంగా వర్షాలు పడకపోవడంతో చాలా మంది రైతన్నలు పంటలు పెట్టక తెచ్చిన విత్తనాలను ఇంటిలోనే ఉం చుకొని ఆర్థికంగా నష్టపోయారని వెంటనే ప్రభుత్వం రైతన్నలను ఆదుకొని ప్రయత్నం చూపాలని లేపాక్షి సిపిఐ మండల కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు రైతన్నల సమస్యలపై వినతి అందజేశారు.

రూ.2 లక్షలు రైతులకు రుణమాఫీ చేయాల్సిందే..!

విశాలాంధ్ర-నల్లమాడ: తెలంగాణ రాష్ట్రం తో పాటు ఏపి రాష్ట్రం రైతులకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు జిల్లా సమితి సంఘం ఏఐకెఎస్ (ఏఐకెఎస్) చంద్ర పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రము లో ని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు మెనీ ఫెస్టివల్ వాగ్దానాలు చేసిన వాటిని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరహా ప్రతి రైతుకు రూ 2 లక్షల రుణ మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. 60 సంవత్సరాల నిండిన ప్రతి రైతుకు 10 వేలు రూపాయలు పెన్షన్, కౌలు రైతులకు గుర్తింపు కార్డు లు, బిందు తుంపర సేద్యపు పరికరాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువతి మృతి

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీలోని బసవతారకరామ కాలనీ నందు నివసిస్తున్న రమణ భార్యవాణి సోమవారం పురిటి నొప్పులు రాగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెకు కాన్పు కావడానికి ఇబ్బందిగా ఉందని డాక్టర్లు వాణ్ణి కి సిజరిన్ ఆపరేషన్ చేసిన తర్వాత ఆమెకు మగ బిడ్డకు జన్మనిచ్చి మూడు గంటల తర్వాత ఆమెకు గుండెనొప్పితో మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఇలాంటి సంఘటనలు ప్రతి 1000 మందిలో ఒకరికి జరగవచ్చునని డాక్టర్లు తెలిపారని వారు బంధువులు తెలిపారు. ఆమె చనిపోవడం తీవ్ర బాధను కలిగిస్తుందని బాబు జన్మనిచ్చిన తర్వాత బాబు ఆరోగ్యంగా ఉన్నాడని తల్లి లేని లోటు బిడ్డకు తెలియడం లేదని బంధువులు అరణరోధన చేశారు.

రాస్తా వివాదాన్ని పరిష్కరించండి

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని కె.కె.పాళ్యం గ్రామంలో రాస్తా వివాదా న్ని పరిష్కరించాలని కోరుతూ తాహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ రాంభూపాల్‌రెడ్డి కు గ్రామస్తులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇందిరమ్మ కాలానికి సంబంధించి రోడ్డు ఉందని, ఆ రోడ్డుకు ప్రస్తుతం సీసీ రోడ్డు వేయడానికి పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు కొలతలకు వచ్చినప్పుడు మా గ్రామానికి చెందిన ఒక వ్యక్తి రోడ్డు కొలతలు వేయడాన్ని అడ్డగిస్తున్నాడని, కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గ్రామ అభివృద్ధి కొరకు రోడ్డు కొలతలను ఎలాంటి ఆటంకం కలిగించకుండా వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ ప్రకాష్, కాంతరాజు, సిద్ధప్ప నాగమ్మ, మమత, మధు, పార్వతమ్మ, శ్రీదేవి, శశికుమార్, రంగనాథ తదితరులు కోరారు.

ప్రభుత్వ రేషన్ షాపులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-గోరంట్ల: తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారులు ప్రభుత్వ రేషన్ షాపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి,మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప కోరారు. అలాగే ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రివర్య మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రస్తుత తెదేపా రాష్ట్ర పాల్గొన్న ఉపాధ్యక్షులు నిమ్మల క్రిష్టప్ప గోరంట్ల మండలం లోని వెంకటరమణ పల్లి గ్రామంలో ప్రభుత్వ చౌక దుకాణాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. పెనుకొండ కమ్యూనిస్ట్ నాయకులు శ్రీరాములు,మాజీ సర్పంచు నిమ్మల చంద్రశేఖర్, గోరంట్ల మండల వడ్డెర సంఘం అధ్యక్షులు కడప రామాంజి, వడ్డెర సంఘం ముఖ్య నాయకులు అమరనాథ్, సిరగం వాండ్లపల్లి రామాంజి, గుమ్మయ్యగారిపల్లీ గంగాధర్, వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు జయచంద్ర మోహన్,స్థానిక డీలర్ వడ్డే ఆదిమూర్తి, గంగాధరప్ప, చిన్నగంగులప్ప, రామచంద్రప్ప. బోయ ఉత్తప్ప, బోయ టైలర్ వెంకటరాముడు, భద్రకాలి ఈశ్వర్, నరేష్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

దోమలు పుట్టకూడదు... కుట్టకూడదు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని కోలగనహళ్లిలో సీజనల్ వ్యాధుల పై సోమవారం వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. "దోమలు పుట్టకూడదు ,కుట్టకూడదు ", అన్ననినాథంతో డ్రై డే పాటించాలని ,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,రాత్రివెలయందు దోమతెరలు వాడాలని ,నీళ్ళు కాచి చల్లార్చి త్రా గాలని ,వాడి పారవేసిన టెంకాయ చిప్పలు, టైర్లు కాల్చి వేయాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపాద కేంద్రంపై అవగాహన

విశాలాంధ్ర-గుడిబండ : తిమ్మాలాపురంలో 21మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నప్పటికీ, గ్రామ ఐక్య సంఘం సమావేశం నిర్వహించడానికి, శ్రీశక్తి భవనం లేక, చెత్త నుండి, సంపాదన కేంద్రంలో సమావేశం నిర్వహించుకున్నట్లు మహిళా సంఘాల సంఘ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం నుండి శ్రీశక్తి భవనం మంజూరు చేయించాలని సంఘ సభ్యులు మంజుల, శారదమ్మ, రత్నమ్మ, అలివేలమ్మ, మారక్క, సిద్ధమ్మలు ప్రభుత్వాన్ని కోరారు.

పాల డైరీ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-తలుపుల: మేజర్ పంచాయతీలో పాల డైరీ సమస్యపై పట్టించుకోని అధికారులు ఎంఆర్ఓ ఆఫీస్ దగ్గర ఉండే అమూల్ డైరీ దగ్గర పాలు కడిగిన క్యాన్లు కడుగా వచ్చు వాటర్ ఒక గుంతలో పడుతుంది. ఆ గుంత నిండిపోయి దాదాపు నెల రోజుల నుంచి వేస్టేజ్ వాటర్ బయటికి వెళుతున్నాయి. దానివలన దుర్వాసన వస్తున్నది, అక్కడ ఉండే ఎమ్మార్వో ఆఫీస్ లో అధికారులు గానీ, అక్కడ ఉండే ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది గాని పట్టించు కాలేదు. ఈ డైరీలో పనిచేస్తున్న సూపర్వైజర్ అధికారులు ఎట్ల పోతే మాకేమి లే అన్నట్లు వున్నారు. అక్కడికి దగ్గర్లో చిన్నపిల్లలు చదివే ఎంపీపీ స్కూల్ ఉన్నది. ఆ వాసన దాదాపు అంటే 200 మీటర్లు తగులుతాది. చిన్నపిల్లలకి దుర్వాసన వచ్చి ఇన్ఫెక్షన్ జరిగితే దీనికి, కారకులు ప్రభుత్వ అధికారులే అవుతారనీ స్థానికులు తెలియజేశారు.

రోడ్డు ఆక్రమణలకు గురి కాలేదు మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీ సర్వే నంబర్ 681లో 1.34 సెంట్లు భూమి ఆక్రమణకు గురికాలేదని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ తెలిపారు. ఆభూమి కొండాపురం కోనాపురం మంగాపురం వెళ్లే రహదారి అని కొందరు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని, ఆ పట్టా (సుధాకర్ రెడ్డి) భూమిలో బండి దారి ఉన్నట్లు రికార్డులు తెలుపుతున్నాయన్నారు. మడకశిర రోడ్డు విస్తరణలో భాగంగా సర్వేనెంబర్ 682 ప్రకారం 681 సర్వేనెం బర్ భూమి దక్షిణానికి ఉన్నట్లు గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారని, ఆదివారం కొందరు రోడ్డు అన్యాక్రాంత మవుతున్నదని, అన్యాయాలకు పాల్పడుతున్నాడని, నిందించడం సబబు కాదని.. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన రిపోర్టులను అలాగే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చూపించారు. పూర్వాపురాలు విచారించ కుండా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: పట్టణంలో నేడు స్కీం వర్కర్స్ తలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు అంగనవాడీలు, ఆయా శాఖల కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.అనంతరం ఆర్డీఓ రాణి సుస్మిత గారికి వినతిపత్రం అందజేసినారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లాఅధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయకార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లోనూ కొత్త ప్రభుత్వం ఏర్పాటైన మరుసటి రోజు నుండి విచ్చలివిడిగా స్కీమ్ వర్కర్లను తొలగిస్తున్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకంలో 2003 నుంచి పనిచేస్తున్న కార్మికులందరినీ తొలగించారు. వారి పైన ఎలాంటి ఆరోపణలు లేవు ఎందుకు తొలగిస్తున్నాము కూడా మీరు చెప్పకుండా ఎంఈవో లకు నాయకులు చెప్పారు మీరు బయటికి వెళ్ళండి కొత్త వాళ్ళు వస్తారని బయటకు పంపించేస్తున్నారు. జిల్లా అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు కూడా పాటించడం లేదు గ్రామ సంఘాలు నడవడంలో పాత్ర పోషిస్తున్న వి ఓ ఏ లు 480 మంది ఉన్నారు వీరిలో సుమారు 250 మంది నీ పనిలోకి రానివ్వకుండా సి.సి., ఏపీఎం లు కొత్త వారికి లాగిన్ ఇచ్చి పని చేయిస్తున్నారు. గ్రామ సంఘం అనుమతి లేకుండా కొత్త వారిని నియమిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి అక్రమంగా తొలగించినని ఓఏలను విధుల్లో కి తీసుకోవాలి కోరుతున్నాం ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఈ రెవెన్యూ డివిజన్ మండలాల్లోనే ఎక్కువగా తొలగించారు వారిని మరలా ఉద్యోగంలో చెర్పించుకోవాలి. అంగన్వాడి మరియు ఆశ వర్కర్లను రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారు.

ప్రధానంగా కళ్యాణదుర్గం ప్రాజెక్టులో రెండు గ్రామాల్లో ఓ టిడిపి సర్పంచ్ అంగనవాడీ టీచర్ భర్త వ్యక్తిగత సమస్యల నుండి టీచర్ ను మార్చాలంటూ అధికారులతో మాట్లాడుతూ అంగనవాడీ టీచర్‌ను బెదిరిస్తున్నారు.ఇలాంటివి అనేకంగా అంగనవాడీలు ఇబ్బందులు పడుతున్నారు వారికి న్యాయం చేయాలి. గ్రామ పంచాయతీ వర్కర్లను తొలగించారు. కొంతమందిని రాజీనామా చేయాలని వేదిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నూతన రేషన్ షాపును ప్రారంభం

విశాలాంధ్ర-మడకశిర: మండల పరిధిలోని ఆమిదాలగొందిలో సోమవారం టీడీపీ నాయకులు నూతన రేషన్ షాపును ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గుండుమల మాజీ సర్పంచ్ చంద్రప్ప హాజరయ్యి రేషన్ షాపును ప్రారంభించి నూతన డీలర్ నరసింహమూర్తికి శుభాకాంక్షలు తెలిపి గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం నుండి వచ్చే సరుకులను ప్రతి ఒక్కరికి న్యాయమైన పద్ధతిలో అందించాలని తెలిపారు. ఏ పార్టీకైనా డీలర్లు వెన్నెముక లాంటి వాళ్ళని డీలర్లు ప్రజలకు చేసే సేవ వల్లనే గ్రామాల్లో పార్టీలు పటిష్టంగా ఉంటాయని, కాబట్టి ప్రతి డీలర్ ప్రజలతో మర్యాదపూర్వకంగా మసులుకోవాలని సూచించారు.మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, మంజునాథ్‌గౌడ్, కోట్ల రంగయ్యగౌడ్, యువ నాయకులు ఏబి మంజునాథ్, నర్సాగౌడ్, ఎల్‌బిసి రామచంద్రప్ప, రామకృష్ణప్ప, నాగన్న లక్ష్మీనారాయణ, మహేష్, పురుషోత్తమప్ప, వేణు,ఎం మంజునాథ్, హేమంత్, నూకయ్య, చిరంజీవి, గోపాలరెడ్డి, పాతన్న, నారాయణప్ప, దానకర్ణ రామమూర్తి నాయక్, నాగరాజు, సోమశేఖర్, ఎంకప్ప, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో తల్లిపాల వారోత్సవాలు..

విశాలాంధ్ర-గుత్తి : మునిసిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో సోమవారం సుంకులమ్మ గుడి వద్ద అంగన్వాడీ సెంటర్ లో అంగనవాడి కార్యకర్త కృష్ణ కుమారి, హెల్త్ సెక్రటరీ రూప ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 22వ వార్డు ఇన్ ఛార్జ్ మాజీ కౌన్సిలర్ సుంకన్న పాల్గొన్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ సుంకన్న మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,గుత్తి టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ ఆదేశాల మేరకు తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించామని పిల్లలకు తల్లిపాలే శ్రేష్టము అని ఆరోగ్యకరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కృష్ణకుమారి,హెల్త్ సెక్రెటరీ రూప , మాజీ కౌన్సిలర్ సుంకన్న, అంగన్వాడీ సిబ్బంది , తల్లితండ్రులు, పిల్లలు, గర్భవతులు పాల్గొన్నారు.

జడ్పీటీసీకి ఛాంబర్ కేటాయింపు

విశాలాంధ్ర-అగళి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పిటిసి ఉమేష్‌కు ఛాంబర్‌ను కేటాయించారు. ఆ ఛాంబర్‌ను సోమవారం ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో జడ్పిటిసి ఉమేష్‌కు మండల పరిషత్ కార్యాలయంలో ఛాంబర్ కేటాయించలేదు దీంతో జడ్పీటీసీ ఉమేష్ సమావేశం లో పాల్గొనడానికి ఏదైనా సమస్యలు ఉంటే అధికారుల తో మాట్లాడానికి మాత్రమే ఆయన మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మండల పరిషత్ కార్యాలయంలో జడ్పిటిసి ఉమేష్ కు ఛాంబర్ ను కేటాయించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటి ఉమేష్ కన్వీనర్ కుమారస్వామి మాజీ సింగల్ విండో అధ్యక్షులు ఇరిగేపల్లి శ్రీనివాస్, జిల్లా వాల్మీకి ఉపాధ్యక్షులు కోడి పల్లి బోయ రమేష్, మాజీ ఎంపీపీ నరసింహప్ప మండల ప్రధాన కార్యదర్శి జయన్న, కోడిపల్లి సర్పంచ్ నరసింహమూర్తి, ఇరిగేపల్లి సర్పంచ్ లక్ష్మమ్మ లింగరాజు, కసాపురం శ్రీనివాస్, శివన్న మాజీ సర్పంచులు రవికుమార్,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి -ఎమ్మెల్యే సూచన

విశాలాంధ్ర-అగళి : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్న స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండల పరిధిలోని మధూడి ఉన్నత పాఠశాలను సోమవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించి బాగా చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దాసేగౌడ్ ఉపాధ్యాయ బృందం వారిని ఘనంగా సన్మానించారు. తొలుత కసాపురం గ్రామంలోని రోడ్లను పరిశీలించారు. అనంతరం ఇనుగలూరు గ్రామం లోని ఎన్టీఆర్ స్నుజల స్రవంతి తాగునీటి ప్లాంటును మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి ప్రారంభించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

విశాలాంధ్ర-గోరంట్ల: సోమందేపల్లి ప్రాజెక్ట్ గోరంట్ల మండలంలోని రాజీవ్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ పిడి నాగ మల్లేశ్వరి సీడీపీవో అనురాధమ్మ ఆదేశాల మేరకు సూపర్వైజర్ రజిత తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ మండల మైనారిటీ నాయకుడు అజంతుల్లా, మండల నాయకులు పచ్చా అశోక్, కక్కల రఘునాథ్ రెడ్డి, సురేష్ కుమార్,బిజెపి మండలం అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి , బొట్టు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ,సంతోష్ హాజరయ్యారు. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని ప్రతి ఒక్క తల్లి కేవలం తల్లిపాలు తాగించాలన్నారు. పచ్చా అశోక్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి వ్యాక్సిన్ ఆరు నెలల పాటు వ్యాధి నిరోధక శక్తిని కలిగిస్తుందని అపోహలు మాని తల్లిపాలు తాగించాలన్నారు. ఎ ఎన్ ఎమ్ శాంతి,చరిత తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. తల్లిబిడ్డల ఆరోగ్యం కోసం పాలిచ్చే తల్లులకు మద్దతు ఇద్దామని తల్లిపాల వారోత్సవాలు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూపర్వైజర్ రజిత పిలుపునిచ్చారు.

గుత్తిలో ఎస్సీ బాలికల హాస్టల్ ను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

విశాలాంధ్ర-గుత్తి: స్థానిక ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రమేష్ ఆధ్వర్యంలో స్థానిక గుత్తి పట్టణంలో ఎస్సీ సంక్షేమ శాఖ గుత్తి డివిజన్ అధికారిణి కార్యాలయంలో ఏఎస్ డబ్ల్యూఓ రాధిక కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి. రమేష్ మాట్లాడుతూ స్థానిక గుత్తి పట్టణంలో ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని,గుత్తి పట్టణంలో ఉన్న బాలికల కళాశాల నందు ఉరవకొండ,విడపనకల్లు, చిప్ప గిరి, గుంతకల్, పత్తికొండ, ప్యాపిలి, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి తదితర మండలాల నుంచి కళాశాలలో చదవడానికి చేరుతున్నారు అయితే ఇక్కడున్న బీసీ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకే ఆ భవనం సరిపోవడం లేదు.కొత్త అడ్మిషన్స్ చేరే విద్యార్థులకు వసతి లభించడం లేదు చాలా మంది విద్యార్థులు హాస్టల్ వసతి లేక టీసీలు తీసుకొని చదువులకు దూరం అవుతున్నారు.ఎస్సీ కళాశాల హాస్టల్ కళాశాల పరిసర ప్రాంతాల్లోనే నూతన భవనం ఏర్పాటు చేసి విద్యార్థినిలకు చదువుకునే అవకాశం కల్పించాలి.